క్లుప్తంగా

ముత్యాలమ్మ, దుర్గాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం

- ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు: శృంగవరంలో ముత్యాలమ్మ, దుర్గాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శిఖర ప్రతిష్ట కార్యక్రమం అనంతరం అమ్మవార్ల దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను దుశ్శాలువాతో సన్మానించారు. సర్పంచ్ సింగంపల్లి సత్యవతి, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



జి.గంగవరంలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రరావు

మాకవరపాలెం: ఉపాధి పనులను పర్యవేక్షించకపోతే చర్యలు తప్పవని టెక్నికల్ సిబ్బందిని ఎంపీడీవో చంద్రరావు హెచ్చరించారు. జి.గంగవరం, లచ్చన్నపాలెం గ్రామాల్లో ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్ షీట్లను తనిఖీ చేసి కూలీలతో మాట్లాడారు. ఎంత పనికి ఎంత వేతనం వస్తుందనే విషయాన్ని టెక్నికల్ సిబ్బంది చెబుతున్నారో లేదో తెలుసుకున్నారు. పనుల పర్యవేక్షణకు ఏపీవో, టెక్నికల్ సిబ్బంది, ఈసీ వస్తున్నారా లేదా ప్రశ్నించడంతో రాలేదని కూలీలు సమాధానమిచ్చారు. ఇకపై నిత్యం పనులను పర్యవేక్షించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో స్పష్టం చేశారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



కల్యాణ మహోత్సవంలో భక్తులు

కె.కోటపాడు: పాచిలవానిపాలెంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చైత్రశుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, గండి సత్యనారాయణ, సిరపరపు రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

పైడంపేటలో ఫ్రైడే-డ్రైడే



మురుగు నిల్వలు తొలగించే చర్యలను పరిశీలిస్తున్న హెల్త్ అసిస్టెంట్ రాజు

కె.కోటపాడు: ఇంటి పరిసరాలతోపాటు సమీప ప్రాంతాల్లో మురుగు నిల్వలు లేకుండా చూసుకోవాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు సూచించారు. శుక్రవారం పైడంపేటలో పంచాయతీ, వైద్య సిబ్బందితో కలిసి ఫ్రైడే-డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బందితో మురుగు నిల్వలు తొలగించే ప్రక్రియను ఆయన పర్యవేక్షించారు. మురుగు వల్ల దోమల వృద్ధి చెంది, తద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధులు సోకుతాయన్నారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లలో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. ఏఎన్ఎం సత్యవేణి, పావని, ధనలక్ష్మి పాల్గొన్నారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

చీడికాడ: ఈ నెల 21న మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఇప్పటికే ఆరోతరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టికెట్లతో పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. హాల్ టికెట్‌తోపాటు ఆధార్ జిరాక్స్, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

జగనన్న పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

- టీడీపీ వస్తే అంతా అవినీతిమయం
- ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



బుచ్చెయ్యపేట: పెదపూడిలో కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న విప్ ధర్మశ్రీ



కొత్తకోటలో ఉపాధి కూలీల సమస్యలు వింటూ ఓట్లు అభ్యర్థిస్తున్న ధర్మశ్రీ



చోడవరం: కోఆపరేటివ్ కాలనీలో ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: రాష్ట్రంలో 14 ఏళ్ల చంద్రబాబు పాలన బాగుందో, ఐదేళ్ల జగనన్న సంక్షేమ పాలన బాగుందో ఆలోచించి రానున్న ఎన్నికల్లో ప్రజా తీర్పు అందించాలని ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ కోరారు. శుక్రవారం పెదపూడిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. గత టీడీపీ పాలనలో పింఛన్, రేషన్ కార్డు, పక్కా ఇల్లు, ఇలా ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీలకు మామ్మూళ్లు ఇచ్చి మండల కేంద్రాల చుట్టూ పలుమార్లు తిరిగినా ప్రయోజనం ఉండేది కాదన్నారు. ఎవరైనా చనిపోతే మరొకరికి పింఛన్ వచ్చేదని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగనన్న పాలనలో సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి గ్రామంలోనే సచివాలయం ఏర్పాటు చేసి పది డిపార్టుమెంట్ అధికారులను నియమించి వలంటీర్ల ద్వారా పైసా లంచం ఇంటికే పింఛన్ సొమ్ము, బియ్యం ఇస్తున్నారన్నారు. వీటితోపాటు ఇల్లు, స్థలం, చేయూత, అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత, విద్యా, వసతి దీవెన తదితర పథకాలు నేరుగా అందేలా చేశారన్నారు. గతంలో రైతులు విత్తనాలు, ఎరువులు పొందాలన్న మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేదన్నారు. అయినప్పటికీ దొరికేవి కావన్నారు. నేడు గ్రామాల్లోనే ఆర్బీకేల ద్వారా అవసరమైన సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారన్నారు. పండిన పంటను గ్రామంలో అమ్ముకునే అవకాశాన్ని కల్పించారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే ఈ పథకాలన్నీ కొనసాగుతాయన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, జిల్లా ప్రచార కార్యదర్శి జోగా కొండబాబు, సర్పంచ్ గోకివాడ వరకృష్ణ, ఎంపీటీసీ గోకివాడ రాము, నాయకులు కుంచం ప్రకాశరావు, వెంకటపతి రాజు, అప్పలరాజు, రాజుబాబు పాల్గొన్నారు.

చోడవరంలో హుషారుగా ధర్మశ్రీ ప్రచారం

చోడవరం: పట్టణంలో ప్రజా సమస్యలన్నీ పరిష్కరించామని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ప్రజలను కోరారు. ఇంటింటికీ వెళ్లి తనకు మద్దతు ఇవ్వాలని ఆయన అభ్యర్థించారు. చోడవరం పట్టణంలో బాలాజీనగర్, కోఆపరేటివ్ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో చోడవరం పట్టణంలో పూర్తిగా మంచినీటి సమస్య పరిష్కరించామన్నారు. జెడ్పీటీసీ మారిశెట్టి విజయ శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో వార్డు మెంబరు కందర్ప మాధురీశంకర్, బ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధి వడ్డాది నర్సింహమూర్తి, శ్రీరామ్మూర్తి, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, జిల్లా మహిళా విభాగం కార్యదర్శి అల్లాడ భవానీ, ఎంపీపీ గాడి కాసు, మహిళా అధ్యక్షురాలు యర్రా దేవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.



మర్రివలసలో ధర్మశ్రీ సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నూకరాజు

ఫ్యాన్ గాలిలో కొట్టుకుపోవడం ఖాయం

నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ భార్య కళావతి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న కళావతి

గొలుగొండ: ఎన్ని పార్టీలు కలిసి కూటమిగా ఏర్పడినా వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్ గాలిలో కొట్టుకుపోవడం ఖాయమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సతీమణి కళావతి అన్నారు. ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో శుక్రవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. ఐదేళ్ల పాలనలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఇటువంటి మంచి వ్యక్తిని గెలిపించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తమ కుటుంబంలో ఎవరైనా నియోజకవర్గ ప్రజలపై ఏనాడైనా అజమాయిషీ చేశామా అని ప్రశ్నించారు. అయ్యన్నపాత్రుడు కుటుంబ పెత్తనంలో నలిగిపోవద్దని ఓటర్లను కోరారు. నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర నాయుడు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ యూత్ అధ్యక్షుడు రామకృష్ణనాయుడు, సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు పాణీశాంతారామ్, సర్పంచ్ లోచల సుజాత, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రుల్లో అగ్నిమాపకదళ మాక్‌డ్రిల్



కార్బన్‌డైఆక్సైడ్ సిలిండర్ వినియోగంపై అవగాహన



మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి వద్ద సిబ్బంది అవగాహన

చోడవరం రూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని పలు ఆస్పత్రుల్లో భద్రతా చర్యల పట్ల చోడవరం అగ్నిమాపకదళ సిబ్బంది మాక్‌డ్రిల్ నిర్వహించారు. కొత్తూరు జంక్షన్‌లోని చిన్నపిల్లల ఆస్పత్రిలో అగ్నిమాపక దళాధికారి బి.వి.రామస్వామి, ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ మల్లునాయుడుల నేతృత్వంలో ఆస్పత్రి సిబ్బందికి ప్రమాద నివారణ, ముందస్తు జాగ్రత్త చర్యల గురించి అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో ఎలా బయటపడాలన్న అంశంపై ప్రయోగాత్మకంగా చేసి చూపారు. అగ్ని ప్రమాద నివారణ ఉపకరణాల వినియోగం, కార్బన్‌డైఆక్సైడ్ సిలిండర్ల వాడకం గురించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. వైద్యులు రేపాక బంగారుకృష్ణ, శేఖర్ నగేష్, రాము, ఆస్పత్రి, అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: విద్యుత్ షార్టు సర్క్యూట్ సంభవించినప్పుడు తగు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు నివారించవచ్చునని మాడుగుల అగ్నిమాపక కేంద్రాధికారి వి. రాజేశ్వరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి, సెయింట్ ఆన్స్ ఆస్పత్రిలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ

జిల్లా మలేరియా అధికారి వరహాలు దొర



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియాధికారి వరహాలు దొర

రోలుగుంట: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే దోమలు నివారించుకోవచ్చని జిల్లా మలేరియాధికారి బి.వరాహాలు దొర తెలిపారు. ఆయన మలేరియా సహాయాధికారి వి.జి.ఎం.ఆర్.పి.నాయుడితో కలసి వై.బి.పట్నం, పనుకులపాలెం తదితర గిరిజన గ్రామాలను శుక్రవారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో నర్సీపట్నం సబ్ యూనిట్ అధికారి కె.బెన్నయ్య ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా మలేరియాధికారి పాల్గొన్నారు. దోమలు వ్యాప్తి, వాటి నివారణ, వాటి వల్ల వచ్చే రోగాలు, తీవ్రత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా వాడి పారేసిన కొబ్బరి బొండాలు, టైర్లు తదితర వాటిని గ్రామాలకు దూరంగా విడవాలన్నారు. మురుగు నిల్వ లేకుండా చేసుకోవాలన్నారు. గోలెంలో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వల్ల నాచుపట్టి దోమలు వ్యాప్తి చెందుతాయని తెలియజేశారు. గోలేళ్ల నాచుతో నిల్వలను గుర్తించి వెంటనే పారబోయించారు. వీటిని పూర్తిగా శుభ్రం చేసి ఎండలో ఎండబెట్టాలని, ఇలా ప్రతి రెండు రోజులకు శుభ్రం చేయాలని గృహిణులకు సూచించారు. ఏఎన్ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్ రుత్తల హరి పాల్గొన్నారు.

పోలింగ్‌కు లోసింగి గిరిజనులకు వాహన సదుపాయం



లోసింగిలో గిరిజనులతో చర్చిస్తున్న మండల నోడల్ అధికారి అల్లు సూర్యనారాయణ

రోలుగుంట : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు కొండపై నుంచి గిరిజనులను కిందికి తీసుకువచ్చి, తిరిగి వారిని గ్రామానికి తరలించడానికి వాహనాలు ఏర్పాటు చేయనున్నట్టు మండల నోడల్ అధికారి అల్లు సూర్యనారాయణ తెలిపారు. అనకాపల్లి ఆర్డీవో చోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నకృష్ణ ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన లోసింగి వెళ్లారు. రవాణా మార్గాలను అన్వేషించారు. అక్కడ అర్ల పంచాయతీలో గల కొత్తలోసింగి, గుర్రాలబయిల, పాత లోసింగి, పీత్రు గెడ్డ తదితర శివారు గ్రామాల వారిని సమావేశపరిచి త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు చేయడానికి కొండపై నుంచి దిగువకు రవాణా కష్టాలు లేకుండా రావడానికి పోలింగుబూత్ ఎక్కడ ఏర్పాటు చేయాలన్న అంశంపై వారితో చర్చించారు. దీంతో శరభవరం పోలింగ్ బూత్‌లోనే ఓటు వేసేందుకు వస్తామని, అందుకు రవాణా సదుపాయం కల్పించాలని వారు కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోసింగి గిరిజనులు కొండ దిగువకు వచ్చి ఓటు వేయడానికి వాహన సదుపాయం కల్పిస్తామని తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

- ఎన్నికల ప్రచారంలో హీరో సాయిరాంశంకర్



తామరంలో ప్రచారం చేస్తున్న హీరో సాయిరాంశంకర్

మాకవరపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో అన్నివర్గాలకు చేసిన అభివృద్ధిని గుర్తించి ఈ ఎన్నికల్లో ఓటేయాలని సినీ హీరో, నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సోదరుడు సాయి రాంశంకర్ కోరారు. తామరంలో ఆయన శుక్రవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, సర్పంచ్ చెల్లారత్నంతో కలసి ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం అభివృద్ధి పనుల వివరాలతో ముద్రించిన పత్రాలను పంపిణీ చేస్తూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగించారన్నారు. సీఎం నేతృత్వంలో నర్సీపట్నం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే గణేష్‌ను వచ్చే నెల ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సచివాలయాల మండల కన్వీనర్ చిటికెల రమణ, మండల యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పెట్ల భద్రాచలం, పీఏసీఎస్ డైరెక్టర్ ద్వారపు రెడ్డి అయ్యన్న, తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో రెండు నామినేషన్ల దాఖలు

అట్టహాసంగా నామినేషన్ వేసిన టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు



ఆర్వో సత్యవాణికి నామినేషన్ పత్రం అందజేస్తున్న బీఎస్పీ అభ్యర్థి తిరుపతిరావు

మాడుగుల: వచ్చే నెల 13న జరిగే శాసనసభ ఎన్నికలకు సంబంధించి రెండో రోజు శుక్రవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్వో జి.వి. సత్యవాణికి బీఎస్పీ అభ్యర్థి కరణం తిరుపతిరావు ఒక సెట్టు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈయన్ను పరువాడ అప్పారావు బలపరిచారు. టీడీపీ అభ్యర్థిగా పైలా ప్రసాదరావు నామినేషన్ దాఖలు చేయగా, డమ్మీ అభ్యర్థిగా పైలా ఇ.వి.ఎస్. నాయుడు దాఖలు చేశారు. వీరిని పైలా ఉత్తమ దేవ్ బలపరిచారు. ప్రసాదరావు తన అనుచరులతో ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి ర్యాలీగా వచ్చి స్థానిక బస్టాండ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈయనకు మద్దతుగా నాలుగు మండలాల నుంచి వాహనాలతో కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు.

ఆర్మీ జవాన్‌కు అంతిమ వీడ్కోలు



వరహాలు మృతికి నివాళిగా గాలిలోకి పోలీసులు, ఆర్మీ జవాన్ల కాల్పులు

బుచ్చెయ్యపేట: పి.భీమవరం గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి పడాల వరహాలు అంత్యక్రియలు అధికార లాంఛనాల మధ్య ముగిశాయి. ఈ నెల 16న దేవరాపల్లి మండలం వాకపల్లిలో తన అత్తవారింటికి ద్విచక్ర వాహనంపై వెళ్తూ చీడికాడ మండలం పెదగోగాడ వద్ద ప్రమాదవశాత్తు కల్వర్టులో పడిపోయి మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం తన స్వగ్రామం పి.భీమవరంలో అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర నిర్వహించారు. అనంతరం పోలీస్ గౌరవ లాంఛనాల మధ్యన వరహాలు మృతదేహానికి అంత్యక్రియలు పూర్తి చేశారు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ ఈశ్వరరావు, పోలీసులు,ఆర్మీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సభ విజయవంతానికి తరలిరండి

నాతవరం: మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సు యాత్ర పాయకరావుపేట, యలమంచిలి నియోజకవర్గాల్లో ప్రారంభమై శనివారం సాయంత్రం అనకాపల్లి నియోజకవర్గంలో ప్రవేశిస్తుందన్నారు. నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలు, పార్టీ శ్రేణులు కశింకోట మండలం తాళ్లపాలెం తరలి రావాలన్నారు. అక్కడ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం ప్రసంగిస్తారన్నారు. ఎమ్మెల్యే గణేష్ ఆధ్వర్యంలో బయలుదేరాలని కోరారు.

పాఠశాలను పరిశీలించిన ఎంపీడీవో



చినగొలుగొండపేటలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: మండలంలోని పెదగొలుగొండపేట, మన్యపురట్ల, ఎస్.బి.పట్నం, చినగొలుగొండపేట గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో రాంబాబు పర్యటించారు. ఆయా గ్రామాల్లో సచివాలయాల సిబ్బందితో సమావేశమై తాగునీటి ఎద్దడితోపాటు పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలపై సూచనలు చేశారు. చినగొలుగొండపేట పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

గ్రామ వలంటీర్ల రాజీనామాల పరంపర



దేవరాపల్లి: రాజీనామా పత్రాలను అందేస్తున్న కొత్తపెంట వలంటీర్లు



దేవరాపల్లి: రాజీనామా పత్రాలను అందజేస్తున్న వేచలం వలంటీర్లు



దేవరాపల్లి: రాజీనామా పత్రాలను అందజేస్తున్న వాలాబు వలంటీర్లు



దేవరాపల్లి: రాజీనామా పత్రాలను చూపిస్తున్న ఎం. అలమండ వలంటీర్లు



రోలుగుంట: రాజీనామా చేసిన రత్నంపేట వలంటీర్లు



బుచ్చెయ్యపేట : రాజీనామా చేసిన ఆర్ భీమవరం వలంటీర్లు



బుచ్చెయ్యపేట : చింతపాక వలంటీర్లు...

దేవరాపల్లి/బుచ్చెయ్యపేట/రావికమతం/రోలుగుంట: టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గ్రామ వలంటీర్ల రాజీనామాల పరంపర కొనసాగుతోంది. వారు తమ మనోభావాలు దెబ్బతీయడంతో తీవ్ర మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు వలంటీర్లు తెలిపారు. ఇప్పటి నుంచి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

- దేవరాపల్లి మండలం కొత్తపెంటలో 10 మంది వలంటీర్లు పంచాయతీ సెక్రటరీ ప్రకాష్‌కు, వేచలంలో 8 మంది వలంటీర్లు సెక్రటరీ చంద్రకళకు, వాలాబులో ఏడుగురు సెక్రటరీ శ్రీనివాసరావుకు, ఎం. అలమండలో 16 మంది తమ రాజీనామా పత్రాలను శుక్రవారం అందజేశారు.
- బుచ్చెయ్యపేట మండలం ఆర్. భీమవరం, చింతపాక గ్రామ సచివాలయ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శుల ఎంపీడీవో వెంకటాచార్యకు అందిచారు.
- రావికమతం మండలం కొమిర, పి.పొన్నవోలు, మేడివాడ వలంటీర్లు 40 మంది రాజీనామా లేఖలను ఎంపీడీవో భానోజీరావుకు, ఆయా గ్రామాల సచివాలయ కార్యదర్శులకు అందజేశారు.
- రోలుగుంట మండలం రత్నంపేటలో 9 మంది వలంటీర్లు రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మికి అందజేశారు.



బుచ్చెయ్యపేట : రాజీనామా లేఖలు చూపుతున్న కొమిర వలంటీర్లు



రావికమతం : రాజీనామా చేసిన పి.పొన్నవోలు గ్రామ వలంటీర్లు



రావికమతం : రాజీనామా పత్రాలను చూపుతున్న మేడివాడ గ్రామ వలంటీర్లు

10 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధం



సరుగుడు తోటలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కె.కోటపాడు : చౌడువాడలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో 10 ఎకరాల్లో సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. హైస్కూల్ సమీపంలో డి.శివాజీరాజు, కె.సత్యారావు తదితర రైతులకు చెందిన పొలాల్లో సరుగుడు తోటలు దగ్ధమయ్యాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో స్థానికులు ఎంత ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాలేదు. చోడవరం సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. రెవెన్యూ సిబ్బంది నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు.

25న గురుకుల ప్రవేశపరీక్ష

నర్సీపట్నం: గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ వి.వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. 5,6,7,8 తరగతుల్లో ప్రవేశానికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, కళాశాలలో ప్రవేశానికి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. వెబ్‌సైట్‌లో అభ్యర్థి ఐడీ ద్వారా హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.